క్లుప్తంగా

పచ్చి మిర్చి కిలో రూ.120



మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన పచ్చిమిర్చి

పాములపాడు: వంటకాల్లో పచ్చి మిర్చి వాడకం తప్పనిసరి. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన వారపు సంతలో పచ్చి మిర్చి ధర వింటేనే వినియోగదారులకు ఘాటెక్కుతుంది. కిలో మిర్చి ధర రూ.120 ఉండటంతో వినియోగదారులు కిలో తీసుకోదల్చిన వారు పావు కిలోతో సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు కూడా పచ్చి మిర్చి తక్కువ మొత్తంలో తీసుకురావడం విశేషం. సంత మార్కెట్‌లో కూరగాయల ధరలిలా ఉన్నాయి. కిలోల ప్రకారం ఉల్లిగడ్డ రూ.75, టమాట రూ.30, బీరకాయ రూ.60, వంకాయ రూ.40, కాకార కాయ రూ.60, మటిక్కాయలు రూ.40, బీట్‌రూట్ రూ.60. బెండకాయ రూ.40, దొండకాయ రూ.40, మెంతికూర రూ.30, గోంగూర, పాలకూర, చుక్కకూర కట్ట రూ.10ల చొప్పున విక్రయాలు జరిగాయి.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

వెలుగోడు: స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో ఎస్‌ఐ సురేష్ ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. నాటుసారా, మద్యం వంటి అక్రమ రవాణా అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆత్మకూరు– నంద్యాల ప్రధాన రోడ్డు మార్గాలు, కూడళ్లలో వాహనాలు తనిఖీ చేస్తూ రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలి

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు డిమాండ్ చేశారు. వెలుగోడు రిజర్వాయర్‌ను ఆదివారం సందర్శించి కేసీ కెనాల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నా..వదలకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ప్రత్యేక రెజిమెంట్ ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: భారత సైన్యంలో అహీర్ రెజిమెంట్ ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ్ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టిన రెజాంగ్ లా కలశ యాత్రను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ ఇన్‌చార్జ్ శేషఫణి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఎస్. రఘురాముడు యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ మన్నెం బాలస్వామియాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పుల్లారెడ్డి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కలశ యాత్రపై యాదవుల ఆత్మీయ సమావేశం జరిగింది. జిల్లా నాయకులు రమేష్, తిరుపతయ్య, మాజీ సైనికుడు వెంకటేశయ్య పాల్గొన్నారు.

పేరుకుపోయిన గుర్రపు డెక్క



బ్రిడ్జి వద్ద అడ్డుపడ్డ గుర్రపు డెక్క

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామానికి ముందు కుందూ నదిపై ఉన్న బ్రిడ్జి వద్ద గుర్రపు డెక్క పేరుకుపోయింది. నంద్యాల, ఆత్మకూరు, తదితర ప్రాంతాల నుంచి కుందూలో ఉన్న గుర్రపు డెక్క ఆకు నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చి బ్రిడ్జి వద్ద ఆగింది. ఇటీవలే కుందూకు నీటిని విడుదల చేయడంతో ఆకు పెద్దఎత్తున బ్రిడ్జి వద్ద అడ్డుపడినట్లు గ్రామస్తులు తెలిపారు. గుర్రపు డెక్కను తొలగించకుంటే బ్రిడ్జికి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ గుర్రపు డెక్క ఆకు క్రమంగా పెరుగుతున్నట్లు తెలిపారు. అధికారులు మిషన్ల సాయంతో గుర్రపు డెక్కను తొలగించాలని కోరుతున్నారు. లేని పక్షంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడే ముప్పు ఉందని వాపోయారు.

నంద్యాల రచయితలకు సత్కారం

నంద్యాల(వ్యవసాయం): కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాష్ట్ర స్థాయి తెలుగు భాష సదస్సు నిర్వహించారు. తెలుగు భాష వికాస ఉద్యమం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల పట్టణానికి చెందిన తెలుగు పండితులు రచయితలు అన్నెం శ్రీనివాస రెడ్డి, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, మహమ్మద్ రఫీ సత్కారం అందుకున్నారు. 'మాతృభాషగా తెలుగు, అధికార భాషగా తెలుగు' అనే అంశాలపై వారు సదస్సులో ప్రసంగించారు.

సంపద తయారీ ఏదీ?

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- నిర్వహణపై దృష్టి సారించని అధికారులు



నిరుపయోగంగా మారిన చెత్త సంపద కేంద్రం.(ఇన్‌సెట్) సంపద కేంద్రంలో మందు సీసాలు పడి ఉన్న దృశ్యం

బండిఆత్మకూరు : చెత్త నుంచి సంపద తయారు చేయాలన్న ఉద్దేశంతో 2014–19 లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ నిధులతో అట్టహాసంగా షెడ్లను నిర్మించారు. ఆ సమయంలో.. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.3 లక్షల వరకు కేటాయించారు. మండలంలోని 18 పంచాయతీల్లో ఇలా 14 షెడ్లను నిర్మించారు. అయితే కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడంతో మండలంలోని సుమారు 70 శాతం కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.

కానరాని చెత్త శుద్ధి..

అప్పట్లో టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద కేంద్రాల కోసం విశేషంగా ప్రచారం చేసిన విషయం తెలిసిందే. గ్రీన్ అంబాసిడర్లను నియమించి వారి ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఈ షెడ్లలో నిల్వ ఉంచేవారు. కొద్ది రోజుల తర్వాత తయారైన వర్మీకంపోస్టును కిలో రూ.10 చొప్పున రైతులకు అమ్మి పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలని నిర్ణయించారు. అయితే కేంద్రాల నిర్వహణను పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో సంపద మాట పక్కనబెడితే ఉన్న కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

మండలంలో..

బండిఆత్మకూరు, జేసీపాలెం, ఎర్రగుంట్ల, ఏ.కోడూరులో సంపద కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. మిగిలిన గ్రామాల్లోని సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మరికొన్ని గ్రామాల్లో స్థానికులు ఆయా కేంద్రాల్లో కలప, ఇతర సామగ్రిని నిల్వ చేసుకుంటున్నారు.

వాటి బాధ్యత పంచాయతీ అధికారులదే

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీ విస్తరణాధికారులదే. చాలా గ్రామాల్లో షెడ్లు నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. సంపద కేంద్రాలపై పంచాయతీ విస్తరణ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వినియోగంలోకి తేవాలి. – **రామకృష్ణవేణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ**

ఆత్మకూరు సబ్ డివిజన్‌లో కార్డన్ సెర్చ్

- 44 మోటార్ సైకిల్‌ళ్లు, 2ఆటోలు, 60 క్వార్టర్ల మద్యం, 7 బీరు బాటిళ్లు స్వాధీనం



జూటూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోల ఆధ్వర్యంలో ఏక కాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆత్మకూరు మండలం కురుకుంద, పాములపాడు మండలం జూటూరు గ్రామం, నందికొట్కూరు పట్టణంలోని జగనన్న కాలనీ ,జూపాడు బంగ్లా మండలం మండ్లెం గ్రామాల్లో కార్డన్ సర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సరైన ధ్రువ పత్రాలు లేని 44 ద్విచక్ర వాహనాలు, 2ఆటోలను సీజ్ చేశారు. అలాగే అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారి నుంచి 60 క్వార్టర్ల చీప్ లిక్కర్, 7 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఆయా గ్రామాల్లో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటరు, నేరచరిత్ర గల వారి ఇళ్లలో తనిఖీలు చేశారు. అనుమానితుల వేలి ముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైస్ ద్వారా సరిపోల్చారు. దాడుల్లో సీఐలు సురేష్‌కుమార్ రెడ్డి, రాము, సుబ్రహ్మణ్యం, ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్‌ఐలు సురేష్ కుమార్, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలోని కేశవ, రామచంద్ర, ఆంజనేయ స్వామి దేవస్థాముల ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈఓ వెంకట రమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్మన్‌తో పాటు మరో తొమ్మిది మంది కమిటీ సభ్యుల పదవులకు దరఖాస్తులు ఆహానిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం చైర్మన్ ఓసీ, 9 మంది సభ్యులు ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఒక్కొక్కరు చొప్పును మహిళలు, బీసీ నాయీ బ్రాహ్మణ, ఓసీ బ్రాహ్మణ, ఓసీ ఇద్దరు పురుషులు ప్రకారం కమిటీలో ఉండాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు నంద్యాలలోని రైతునగరంలో ఉన్న దేవదాయ శాఖ కార్యాలయంలో అర్హులైన వారు దరఖాస్తు పత్రాలు అందజేయాలన్నారు.


నేటి నుంచి పశువులకు టీకాలు

బండి ఆత్మకూరు : నేటి నుంచి మండలంలోని గ్రామాల్లో గేదెలు, ఆవులకు లంపి వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు వేస్తామని మండల పశు వైద్యాధికారి డా.అనూష ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. కీటకాల వల్ల సంభవించే లంపి వ్యాధి వల్ల పశువులకు శరీరంపై గడ్డలు, జ్వరం, ఆకలి వేయకపోవడం లాంటి లక్షణాలు వస్తాయని, తద్వారా పాల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోవడమే కాక, కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడతాయని చెప్పారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: ఈనెల 15న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ) నరేంద్రకుమార్‌కు అందజేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కొనసాగుతున్న సాగునీటి విడుదల

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నాలుగు గేట్ల నుంచి ఎస్సారెమ్సీ కాల్వలోకి సాగు నీటి సరఫరా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో శ్రీశైలం డ్యాంలో 883.30 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 882.30 అడుగులు నమోదైనట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2,4,5,6 గేట్ల నుంచి గత నాలుగు రోజుల నుంచి 20వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 15వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 5వేల క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఎస్సార్బీసీ కాల్వకు సాగునీరివ్వండి

ఇప్పటిదాకా ఎస్సార్బీసీ కాల్వకు సాగునీటిని సరఫరా చేయకపోవటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు కింద సాగుచేసిన పంటలు వర్షాభావ పరిస్థితులు, సాగునీరు అందక పైర్లు ఎండు ముఖం పట్టాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సత్వరమే ఎస్సార్బీసీ కాల్వకు సాగునీటి నివ్వాలని కోరారు.

నేడు పాములపాడుకు చేరనున్న కేసీ నీరు

కర్నూలు–కడప కాల్వకు విడుదల చేసిన సాగునీరు సోమవారం సాయంత్రానికి పాములపాడు చేరే అవకాశం ఉందని కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 500క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, దానిని క్రమేణా వెయ్యి క్యూసెక్కులకు పెంచుతారన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి సుంకేసుల డ్యాంలోకి వచ్చే ఇన్‌ఫ్లోను బట్టి 2వేల క్యూసెక్కుల వరకు పెంచే అవకాశాలున్నాయన్నారు. లాకిన్స్ లాకు నీళ్లు చేరిన తర్వాతనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతుల డిమాండ్‌ను అనుసరించి నిప్పుల వాగు, తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు సాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో కొండచిలువ



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం కొండచిలువ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసింది. సుమారు 11 అడుగుల పొడవు ఉన్న కొండచిలువ గ్రౌండ్‌లెవెల్ వాటర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో ఉండింది. ట్యాంకును శుభ్రం చేసేందుకు కూలీలు ట్యాంకులోకి దిగే క్రమంలో ట్యాంక్‌లోకి చూడగా కొండచిలువ కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్స్ డి.రమేష్, ముస్తాక్ కొండచిలువను పట్టుకొని అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

ఆత్మకూరులో సీసీ కెమెరాల ఏర్పాటు



పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



పోలీసుల అదుపులో రాము

ఆత్మకూరు: పట్టణంలో నిఘా పెంచేందుకు పోలీసుశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం ఆత్మకూరులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కొత్త బస్టాండు, గౌడ్‌సెంటర్, రఘునాథ్ సెంటర్, నంద్యాల టర్నింగ్, చక్రం హోటల్, గాంధీబజార్, కప్పలకుంట్ల, పాత బస్టాండులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల పట్టణంలో జరుగుతున్న పలు దొంగతనాలు, ఇతర నేరాలను నివారించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఆత్మకూరు సీఐ రాము మాట్లాడుతూ పట్టణంలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలను నివారించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

తప్పిపోయిన యువకుడి ఆచూకీ లభ్యం

పట్టణంలో గతేడాది అప్పులు చేసి ఊరి వదిలి వెళ్లిపోయిన గొల్ల రాము ఆచూకీ లభించిందని ఆత్మకూరు సీఐ రాము తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతేడాది తల్లిదండ్రులు తమ కుమారుడు కనిపించడం లేదని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్పులు చేసి పారిపోయినట్లు కేసు నమోదు చేశారు. చివరికి అతను హైదరాబాద్‌లో ఉన్నాడని సమాచారం రావడంతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట, సనత్‌నగర్ చుట్టుపక్కల గల పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల ద్వారా ఆచూకీ కనుగొన్నారు. ఫోన్ నంబర్ సాయంతో లొకేషన్ గుర్తించి, ఆత్మకూరుకు తీసుకొచ్చారు. పోలీసులను డీఎస్పీ రామంజినాయక్ అభినందించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. స్థానిక ధనుంజయ మీటింగ్‌హాల్ సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024–25లో విద్యుత్ సర్‌చార్జీల పేరిట దాదాపు రూ.842 కోట్లు ప్రజలపై మోపిందన్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని ప్రజలకు హామీలిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు పెంచడం దారుణమన్నారు. అలాగే ఇంధన సర్ చార్జీలను సర్దుబాటు పేరుతో రూ.2,787 కోట్లు వినియోగదారులు చెల్లించాల్సి ఉందని, విద్యుత్ సంస్థలు ప్రభుత్వానికి నివేదికలు అందించాయన్నారు. ఇలా తప్పుడు లెక్కలు చూపుతూ ప్రజలపై భారం మోపడం తగదన్నారు. నాయకులు రామ్ నాయక్, సురేంద్ర, వీరన్న, నాగేశ్వరరావు, ఇస్మాయిల్, భాస్కర్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలంలో ఉర్దూ కళాశాల నిర్మించాలి

నంద్యాల(అర్బన్): స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో ఉన్న మసీదు స్థలం (వక్ఫ్‌బోర్డు స్థలం)లో ఉర్దూ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు చేయాలని అవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌వలి కోరారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్‌లోని వక్ఫ్‌బోర్డు స్థలంపై మంత్రి ఫరూక్, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా చర్చించి ముస్లింలకు ఉపయోగకరమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉర్దూ కళాశాల, వ్యాపార సముదాయం, ముస్లిం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు



డాక్టర్ శశికళారెడ్డి

బండిఆత్మకూరు : కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కొరవడిందని, ఇందుకు ఉప్పాల హారికపై జరిగిన దాడి ఉదంతమే నిదర్శనమని, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్‌కే రక్షణ లేకపోతే సాధారణ మహిళల సంగతి ఏంటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.. శనివారం గుడివాడలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఉప్పాడ హారిక కారుపై టీడీపీ నాయకులు రాళ్లు, కర్రలతో దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఆడపిల్లల వైపు చూడాలంటేనే భయం పుట్టేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ ఊగిపోతూ ప్రకటించారని.. మరి నేడు ఆ ప్రకటన ఏమైందని నిలదీశారు. కేవలం కూటమి పార్టీలో ఉన్న వాళ్లే మహిళలా, మిగిలిన పార్టీ వాళ్లు మహిళలు కాదనే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే..కాకినాడ జీజీహెచ్‌లో బయో కెమిస్ట్రీ ల్యాబ్ అసిస్టెంట్ పారామెడికల్ విద్యార్థినిని సెల్ ఫోన్‌లో అసభ్యంగా చిత్రీకరించి, వేధించిన తీరు కనిపించలేదా అని ప్రశ్నించారు. మహిళా హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలపై ఇలాంటి ఘటనలు జరగడం రాష్ట్రానికే అవమానకరమన్నారు.

సూపర్‌సిక్స్ అమలులో విఫలం



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో స్థానిక ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది సంబరాలు చేసుకోవడం తప్ప చేసేందేమి లేదని ఆరోపించారు. అధికారంలోకి రాగానే గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు మూడు సెంట్లు ఇంటి స్థలం, పట్టణ ప్రాంతంలో పేదలకు రెండు సెంట్లు, గృహ నిర్మాణాలకు నిధులు, అర్హులైన పేదలకు అన్ని రకాల పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు తదితర హామీలు ఇప్పటికీ అమలు చేయడం లేదని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమం జయప్రద చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఏసన్న, ఎల్లనాయుడు, రాజు, మురళి, లక్ష్మీదేవి, నాగమణి, గీతాంజలి, మల్లమ్మ, కాశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హామీలు మరిచి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న రామచంద్రయ్య

జూపాడుబంగ్లా: ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాక వాటిని అమలు చేయకుండా ఇంటింటికి వెళ్లి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. ఆదివారం జూపాడుబంగ్లాలోని వైఎస్సార్ ఫంక్షన్ హాల్లో సీపీఐ మండల మహాసభను నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వైఎస్సార్ ఫంక్షన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ సమావేశం నిర్వహించారు. రామచంద్రయ్య, రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు, రామాంజనేయులు, సోమన్న తదితరులు మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నీటిముంపు నిర్వాసితులకు జీవో 98ప్రకారం ఇవ్వాల్సిన ఉద్యోగాలు ఇప్పటిదాకా ఇవ్వకపోవటం దారుణమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో నిల్చొని తాను అధికారంలోకి వస్తే 98జీవో ప్రకారంగా పెండింగ్‌లో ఉన్న 674 మంది నీటిముంపు నిర్వాసితులకు ఉద్యోగాలిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. చంద్రబాబునాయుడు సీఎం అయ్యి ఏడాదైనా ఇచ్చిన హామీని ఇప్పటిదాకా అమలుచేయకపోగా నీటి ముంపు నిర్వాసితుల కడుపుకొట్టడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమేష్ బాబు, రఘురామ్మూర్తి, శ్రీనివాసులు, నరసింహ, మగ్బూల్‌బాషా, వెంకటశివుడు, దివాకర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ఘాట్ రోడ్‌లో నిలిచిపోయిన వాహనాలు

డ్యాం పరిసరాల్లో ట్రాఫిక్‌జాం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలండ్యాం పరిసర ఘాట్ రోడ్డులో ఆదివారం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సాధారణంగా రెండవ శనివారం, ఆదివారంతో రెండు రోజులు సెలవులు రావడంతో శ్రీశైలానికి భక్తులు వేలాదిగా తరలి వస్తుంటారు. దీనికి తోడు డ్యాం గేటును తెరిచి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తుండడంతో పర్యాటకుల సంఖ్య పెరిగింది. ఘాట్‌రోడ్డులో ఎక్కడపడితే అక్కడ సెల్ఫీల కోసం తమ వాహనాలను నిలుపుదల చేయడం, లింగాలగట్టులో చేపల కొనుగోలుకు వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. టూటౌన్ సీఐ చంద్రబాబు, ఎస్‌ఐ సుబ్బారెడ్డి తమ సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అయినప్పటికీ వాహనాలు గంటలకొద్దీ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి.

వానాకాలం..జర భద్రం!

- విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు
- అప్రమత్తతతో ప్రమాదాల నివారణ
- సమస్యలు ఎదురైతే అధికారులకు సమాచారం ఇవ్వాలి



రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నందికొట్కూరు: వర్షా కాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసరాలు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా పంట పొలాల్లో విద్యుదాఘాతాలకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందంటున్నారు. అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ ప్రమాదాలను నివారించవచ్చని సూచిస్తున్నారు.

విద్యుత్ తీగలు తెగిపడే అవకాశం..

వర్షకాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాలకు గురికావడం ఖాయం. పంట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉంది. విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదో ఒకటికి రెండు, మూడు సార్లు పరిశీలించుకుని నీళ్లలోకి దిగ్గాలి.

రక్షణ కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు..

గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వరకు రక్షణ కంచెలు కూడా ఏర్పాటు చేయలేదు. విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మల మధ్య ఉండటం, పొలాలలో వేసిన విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండటం, ఇళ్లకు సమీపంలో నుంచే తీగలు వెళ్లడం, స్తంభాలు విరిగిపోవడం, ఒరిగిపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే 1912కు కాల్ చేయవచ్చని చెబుతున్నారు.

ఇలా చేయొద్దు..

- ➡ వర్షకాలంలో విద్యుత్ స్తంభాలను తాకే ప్రయత్నం చేయకూడదు.
- ➡ స్తంభాలను తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లను తాకే ప్రయత్నం చేయకూడదు.
- ➡ నీటిలో అడుగులు వేసేటప్పుడు అందులో పడి ఉన్న విద్యుత్ తీగలను గమనించాలి.
- ➡ సబ్‌స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకు దూరంగా ఉండాలి.
- ➡ తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు, మరమ్మతులు చేయకూడదు.

ఇళ్లలో ఈ జాగ్రత్తలు అవసరం..

- ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీరు ఉన్న పరిసరాల్లో విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- వర్షపు జల్లులు పడే అవకాశం ఉన్న చోట విద్యుత్ పరికరాలను ఉంచకూడదు. చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లను తాకకూడదు.
- ప్లగ్‌లను స్విచ్ ఆపకుండా తీయకూడదు.
- నిపుణులతో ఇళ్లకు వైరింగ్ చేయించాలి.
- పరికరాలకు ఉన్న వైర్లను పట్టి లాగకూడదు.
- సొంతంగా ఇంటికి వైరింగ్ చేయరాదు.
- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెత్తను వేయడం. అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలను ఎక్కడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మూత్ర విసర్జన చేయడం. టెలీ, కేబుల్ వైర్లపై దుస్తులు ఆరేయడం ప్రమాదకరం.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వర్షకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. పలుచోట్ల స్తంభాలు పడిపోతున్నాయి, వాటి మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ప్రాణ నష్టం జరకుండా ఉంటుంది.

– శ్రీనివాసులు ఏడీ , నందికొట్కూరు